

రిబ్బను కత్తిరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, చిత్రంలో మంత్రి కొండపల్లి, అశోక్

మరిన్ని అన్న క్యాంటీన్లు

విజయనగరం పట్టణం, వైద్యవిభాగం, న్యూస్‌టుడే: అన్న క్యాంటీన్లు ఎంతో మంది పేదల ఆకలి తీర్చుతున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఘోషా సుపత్రి ప్రాంగణంలో ఏర్పాటైన క్యాంటీన్‌ను బుధవారం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, కేంద్ర మాజీ మంత్రి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం అల్పాహారం వడ్డించారు. రానున్న రోజుల్లో అవసరమైన అన్ని చోట్లా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. 100 రోజుల పాలనలో తమ ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నగరంలో మూడో క్యాంటీన్ ఏర్పాటు ఆనందంగా ఉందని, నిరుపేదలకు మూడు పూటలా ఆహారం అందుతోందని ఎమ్మెల్యే అదితి పేర్కొన్నారు. ఘోషాలో గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన సోలార్ వేడినీటి ప్లాంటును గత ప్రభుత్వం మూసేసిందని అశోక్ గజపతిరాజు మండిపడ్డారు. దాని పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, నగరపాలిక కమిషనర్ పి. నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.



మహోన్నత ఆశయంతో ఏర్పాటు

రాజాం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజల ముఖంపై చిరునవ్వే లక్ష్యంగా చంద్రబాబు పాలన సాగుతోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం రాజాంలోని ఆర్టీసీ కూడలిలో అన్న క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించి పేదలతో కలిసి భోజనం చేశారు. విజయనగరం - పాలకొండ రహదారిని పీపీపీ విధానంలో నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు.

మధురస్మృతిగా ఉత్సవాలు

ఈనాడు-విజయనగరం, న్యూస్‌టుడే-విజయనగరం అర్బన్: ప్రతి ఒక్కరి మదిలో మధురస్మృతిగా నిలిచిపోయేలా విజయనగరం ఉత్సవాలు నిర్వహిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభిస్తారని, ముగింపు సభకు హోంమంత్రి వంగలపూడి అనిత రానున్నారన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం కలెక్టర్ అంబేడ్కర్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఇతర అధికారులతో సమీక్షించారు. గతం కంటే ఎక్కువ నిధులు వెచ్చించి, ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. అతిథులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ నెల 11 సాయంత్రానికే నగరమంతా విద్యుద్దీపాలంకరణ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సిరిమానోత్సవాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. ఈ సారి మైసూరు పండగలా నిర్వహిస్తామన్నారు. జేసీ సేధు మాధవన్, డీఆర్వో అనిత, ఎస్పీ వకుల్ జిందాల్, ఆర్డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆ దుకాణాలకు ఫుల్‌గా..


ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారుల్లో పోటీ పెరిగింది. విజయనగరంలో బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 153 దుకాణాలకు అత్యధికంగా 3,448 దరఖాస్తులు దాఖలయ్యాయి. ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పెంచడంతో మరింత పెరిగే అవకాశం ఉంది.

ఈనాడు, విజయనగరం

విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల నగర పంచాయతీ సహా నియోజకవర్గం దరఖాస్తుల దాఖలులో ముందంజలో ఉంది. నగర పంచాయతీ పరిధిలోని ఒక దుకాణానికి 41, రెండో దానికి 53 రావడంతో రికార్డు నెలకొంది. నెల్లిమర్ల మండలంలోని నాలుగు దుకాణాలకు 104 దాఖలయ్యాయి. పురపాలక సంఘాల పరిధిలో పరిశీలిస్తే బొబ్బిలిలో ఏడు దుకాణాలకు 113 దరఖాస్తులు వచ్చాయి. ఇదే మండల పరిధిలో నాలుగింటికి 47 దాఖలయ్యాయి. విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో 13 దుకాణాలకు 364 దరఖాస్తులు, గ్రామీణంలో మూడింటికి 101 అందాయి. రాజాం నగర పంచాయతీలో ఏడు దుకాణాలకు 151 దరఖాస్తులు అందాయి.



పార్వతీపురం ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు



పూసపాటిరేగలో 215

జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పూసపాటిరేగ మండలంలో తొమ్మిది దుకాణాలకు 215, భోగాపురం మండలంలో ఏడింటికి 133, డెంకాడ మండలంలో అయిదింటికి 75 దరఖాస్తులు అందాయి. బొండపల్లి మండలంలో 4 దుకాణాలకు 102, దత్తిరాజేరులో 4- 63, గజపతినగరంలో 4-123, గంట్యాడలో 6-139, జామిలో 5-154, కొత్తవలసలో 6-144, ఎల్.కోటలో 6-85, మెంటాడలో 3-60, రామభద్రపురంలో 6-110, రేగిడి ఆముదాలవలసలో 4-74, సంతకవిటిలో 4-92, ఎస్.కోటలో 8-115, తెర్లాంలో 4-114, వంగరలో 2-41, వేపాడలో 4 దుకాణాలకు 120 దరఖాస్తులు నమోదయ్యాయి.

చీపురుపల్లిలో సిండికేటు?

చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి మండలాల్లో అతి తక్కువ దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇక్కడ సిండికేట్ల ప్రభావం కనిపిస్తోంది. ఫలితంగా చీపురుపల్లి మండలంలో ఏడింటికి 133, గరివిడి మండలంలో అయిదింటికి 48, గుర్ల మండలంలో నాలుగింటికి 129, మెరకముడిదాం మండలంలో నాలుగింటికి 77 దరఖాస్తులు దాఖలయ్యాయి. నియోజకవర్గ కేంద్రం చీపురుపల్లి, పారిశ్రామిక ప్రాంతం గరివిడి కన్నా మిగిలిన రెండు గ్రామీణ మండలాల్లో అధికంగా రావడం గమనార్హం.

వెబ్‌సైట్‌లో వివరాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో నోటిఫై చేసిన దుకాణాలు షెడ్యూల్ ఏరియాలో ఏర్పాటు చేస్తే గిరిజనులకు మాత్రమే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని ఎక్సైజ్ శాఖ ఉప కమిషనర్ బాబ్జీరావు తెలిపారు. దరఖాస్తుదారులు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు. షెడ్యూల్ ఏరియాలో దుకాణం నిర్వహణకు గ్రామసభ తీర్మానం తప్పనిసరి అన్నారు. దేనికి ఎన్ని దరఖాస్తులు దాఖలయ్యాయో ఎవరైనా తెలుసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో ఆ వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మహిళలు వేసిన దరఖాస్తులపై ప్రశ్నించగా.. గతంలో ఒక్కొక్కరు ఒకటి మాత్రమే దాఖలు చేసుకునే అవకాశం ఉందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. ఉభయ జిల్లాల్లోనూ ఎక్కడా ఎలాంటి అవాంతరాలు లేవని, స్వేచ్ఛగా దరఖాస్తులు చేసుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పొడిగించినందున వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మన్యంలో 906

పార్వతీపురం మన్యం జిల్లాలో విజయనగరం జిల్లాతో పోల్చితే కాస్త వెనకంజలో ఉంది. విజయనగరంలో 153 దుకాణాలకు 3,448 దరఖాస్తులతో సగటున ఒక్కో దానికి 22.5 నమోదయ్యాయి. మన్యంలో 52 దుకాణాలకు 906 దరఖాస్తులతో సగటున ఒక్కో దానికి 17.4 దాఖలయ్యాయి. మన్యంలో సీతానగరం, సాలూరు మండలాల్లో జోరుగా ఉండగా.. పార్వతీపురం, కురుపాం మండలాల్లో తక్కువగా కనిపిస్తోంది. రెండు జిల్లాల్లో సగటు దరఖాస్తులు 30 శాతానికి తీసుకెళ్లేందుకు ఎక్సైజ్ అధికార యంత్రాంగం కృషి చేస్తోంది.





చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న తల్లిదండ్రులు

జ్ఞాన సరస్వతి ఒడిలో అ.. ఆ లు

విజయనగరంలోని రింగురోడ్డు ఎస్వీఎన్‌నగర్‌లో కొలువుదీరిన జ్ఞాన సరస్వతీ ఆలయంలో మూలానక్షత్రం సందర్భంగా బుధవారం అక్షరాభ్యాసాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా సరస్వతి, మహాలక్ష్మి, భువనేశ్వరీదేవిలకు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం విశేషాలంకరణ జరిగింది. ఈ సందర్భంగా 4 వేల మంది చిన్నారులు తమ తల్లిదండ్రుల ఒడిలో కూర్చొని పలకలపై బలపాలతో అక్షరాలు దిద్దారు. తులాభార సేవలో సందడిగా పాల్గొన్నారు. ఉదయం నుంచి 10 విడతలుగా అక్షరాభ్యాసాలు చేయించామని శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, జి.శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఉదయం ఫలహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించామని చెప్పారు.

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్



అలంకరణలో సరస్వతీదేవి, మహాలక్ష్మి, భువనేశ్వరిదేవి

14న జాతీయ అప్రెంటీస్ మేళా


విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయనగరం ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 14న ఉదయం 9 గంటలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యుడు టి.వి.గిరి తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చన్నారు. వివిధ కంపెనీలు రానున్నాయని, ఎంపికైన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు భృతి చెల్లిస్తారని చెప్పారు. బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని, ఇతర వివరాలకు 98491 18075, 98499 44654 నంబర్లను సంప్రదించాలని కోరారు.



బంగార్రాజును సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపీలు కలిశెట్టి, శ్రీభరత్, ఎమ్మెల్యేలు

కష్టపడి పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు

డెంకాడ, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసే వారికి తెదేపాలో సముచిత స్థానం లభిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. డెంకాడ మండలం నాతవలస వద్ద బుధవారం నిర్వహించిన రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పదవి బంగార్రాజుకు ఇవ్వడం జిల్లాకు గర్వకారణమన్నారు. రైతులకు సేవ చేసే గొప్ప కర్తవ్యాన్ని స్వీకరించిన ఆయనను అభినందించారు. అనంతరం బంగార్రాజు మాట్లాడుతూ రైతు శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తానని, ప్రతి జిల్లాలో గోదాములు నిర్మిస్తామని చెప్పారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు పడుతున్న తపన చూసి ప్రతి నాయకుడు, కార్యకర్త గర్వపడాలన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం నిర్మాణంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకట్రావు, అదితిగజపతిరాజు, ఎన్.ఈశ్వరరావు, గొండు శంకర్, తెదేపా విజయనగరం పార్లమెంటు అధ్యక్షుడు కిమిడి నాగార్జున ప్రసంగించారు. బంగార్రాజును ఘనంగా సత్కరించారు. అంతకుముందు బాధ్యతలు చేపట్టి తొలిసారిగా జిల్లాకు వచ్చిన బంగార్రాజుకు రాజాపులోవ కూడలి వద్ద శ్రేణులు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి మోదవలస, జొన్నాడ, చెల్లూరు, విజయనగరం, డెంకాడ మీదుగా నాతవలస వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, నాయకులు కె.చంద్రశేఖర్, ఎస్.రవిశేఖర్, ఎం.చిన్నంనాయుడు, కె.సత్యనారాయణ, ఐవీపీ రాజు, కె.ఆనంద్‌కుమార్, భాజపా, జనసేన నాయకులు శ్రీధర్, వెంకటరమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.





(c) eenadu

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం: ఎంపీ


చరవాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కలిశెట్టి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: పైడితల్లి సిరిమానోత్సవానికి వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. బుధవారం విజయనగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన డయల్ యువర్ ఎంపీ కార్యక్రమంలో భాగంగా పలువురు సమస్యలు, సూచనలు, సలహాలు చెప్పగా.. వారితో మాట్లాడారు. 30 మంది సంప్రదించారని చెప్పారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టరు అంబేడ్కర్, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరపాలిక సహాయ కమిషనర్ తిరుమలరావు, పైడితల్లి దేవస్థానం ఈవో డీవీవీ.ప్రసాదరావు, తహసీల్దారు కూర్మనాథరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సూచనలివీ..

★ ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ★ సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు బారికేడ్లలోకి ఎక్కువ మందిని అనుమతించాలి ★ దర్శనానికి వచ్చే వారికి తాగునీరు, మజ్జిగా అందుబాటులో ఉంచాలి ★ ఇష్టానుసారంగా ఫ్లెక్సీల ఏర్పాటు, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి ★ బయో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి ★ ముఖ్య కూడళ్లల్లో డిజిటల్ స్క్రీన్లు పెట్టాలి ★ వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించాలి

ఖండాంతరాలు దాటిన కళా నైపుణ్యం!


చిత్రలేఖనానికి జీవం పోసేలా శిక్షణ

వారు కుంచె కదిపితే అద్భుత కళారూపాలు సాక్షాత్కరిస్తున్నాయి.. బొమ్మలు అద్దితే వస్తువులకు కొత్తవన్నెలు వస్తున్నాయి.. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిఫలిస్తున్నాయి.. ప్రతిభకు సృజనాత్మకతను జోడిస్తూ.. అంతరించిపోతున్న ఆదివాసీ చిత్రకళకు జీవం పోస్తున్నారు గిరిజన యువత. న్యూహోప్ ఫౌండేషన్ మన్యంలోని యువతలో నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తూ.. గిరిజన సంస్కృతి చాటిచెప్పేలా చిత్రలేఖనంలో తర్ఫీదు ఇస్తోంది. కళాఖండాలు తీర్చిదిద్దించి వారి ప్రతిభ ఖండాంతరాలు దాటించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

– న్యూస్‌టుడే, సీతంపేట




బెంచీ, ఇతర చోట్ల వేసిన ఆదివాసీ చిత్రాలు


గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా


శిక్షణ పొందుతున్న గిరిజన అభ్యర్థులు

ఆన్‌లైన్‌లో మార్కెటింగ్..

దేశ, విదేశాల్లో ఈ ఆదివాసీ చిత్ర లేఖనాలకు డిమాండు ఏర్పడింది. దీంతో లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ సర్వీస్ సెంటర్(విజయవాడ) ద్వారా ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సహించాలని కళాకారులు కోరుతున్నారు.

ఆకట్టుకునేలా..

లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్స్(ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో సీతంపేటలో ఆదివాసీ గిరిజన యువతకు డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, చిత్రలేఖనంపై రెండు నెలల పాటు ఇటీవల శిక్షణ ఇచ్చారు. మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన యువతకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పారు. మార్కెట్లో ఆదివాసీ చిత్రాలకు ఉన్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా తీర్చిదిద్దేలా తర్ఫీదునిచ్చారు. ఇప్పటి వరకూ గోడలకే పరిమితమైన ఈ ఆదివాసీ చిత్రాలను దుస్తులు, ఇంట్లో అలంకరణ సామగ్రి, బెంచీలు, బ్యాగులు, టీ కప్పులు, హాట్‌బాక్సులు, పెన్, చరవాణుల స్టాండులు, డైరీ తదితరాలపై వేయిస్తున్నారు. సుమారు 100 వరకు కొత్త వస్తువులపై మూడు నమూనా చిత్రాలను తీర్చిదిద్దారు.







బొమ్మలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రోత్సహించేందుకు..

యువతను ప్రోత్సహించేందుకు బెన్హర్ ఆధ్వర్యంలో 'న్యూ హోప్ ఫౌండేషన్'తో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. అంతరించిపోతున్న ఈ కళకు పునరుజ్జీవం తీసుకొచ్చేందుకు హ్యాండీక్రాఫ్ట్, షెడ్, లేపాక్షి సంస్థల సహకారంతో కళాఖండాలు రూపొందించడంలో శిక్షణ ఇచ్చాం. గౌరీష్ తర్ఫీదునిస్తున్నారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ రెండు సార్లు ఈ శిబిరాన్ని సందర్శించారు. పౌష్టికాహారం పంపిణీ, ఎంబ్రాయిడరీ శిక్షణ, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– అనిల్ కుమార్, న్యూ హోప్ ఫౌండేషన్ ప్రతినిధి, హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ రిసోర్సు పర్సన్

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

నేరవార్తా విభాగం, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సైబర్ మోసానికి గురైతే బాధితులు 1930కు ఫిర్యాదు చేయాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ సూచించారు. బుధవారం విశాఖపట్నంలోని తన కార్యాలయం నుంచి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలతో జూమ్ సమావేశం నిర్వహించారు. గతంలో నమోదైన సైబర్ కేసులకు సంబంధించి బ్యాంకు ఖాతాల్లో సీజ్ అయిన నగదును బాధితులకు అందించాలని ఆదేశించారు. అత్యాచార, వరకట్న మరణాలు, పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. దీపావళి వస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయించే దుకాణాలు, గోదాములను తనిఖీ చేసి, లైసెన్సులను పరిశీలించారు.

లక్ష్యాల్లో వెనుకబడితే చర్యలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గృహనిర్మాణ లక్ష్యాల సాధనలో వెనుకబడిన సహాయక ఇంజినీర్లపై చర్యలు తప్పవని కలెక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు. తన ఛాంబర్లో బుధవారం వంద రోజుల లక్ష్యాలపై గృహనిర్మాణ శాఖాధికారులతో సమీక్షించారు. కేవలం ఆరు శాతం మాత్రమే ప్రగతి ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బీబీఎల్ స్థాయిలో ఉన్న ఇళ్లను ఈ నెలాఖరు నాటికి బీఎల్ స్థాయికి తీసుకురావాలన్నారు. 16వ తేదీ నుంచి రోజువారీ ప్రగతి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. పీడీ కూర్మినాయుడు, ఈఈ శ్రీనివాసరావు, డీఈఈలు పాల్గొన్నారు.

ఒక్క అవకాశమిస్తే రాష్ట్రాన్నే ముంచేశారు


మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని, వారి మధ్య భేదాభిప్రాయాలు సృష్టించేలా వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. పరిపాలన అంతా సచివాలయాల ద్వారానే జరుగుతుంటే.. నిర్వీర్యం చేస్తున్నామని జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అశోక్‌బంగ్లాలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్కసారి అవకాశమిస్తే రాష్ట్రాన్నే ముంచేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో తన మార్కు చూపించారని తెదేపా విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. నాయకులు శ్రీధర్, కొండపల్లి భాస్కరరావు, ప్రసాదుల వరప్రసాద్, ఆల్తి బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

ఉత్సవాలకు రూ.3 లక్షల విరాళం


కలెక్టర్‌కు చెక్కు ఇస్తున్న బస్సుల యజమానులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాల నిర్వహణకు జిల్లా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం ప్రతినిధులు భారీ విరాళాన్ని అందించారు. బుధవారం రూ.3 లక్షల చెక్కును కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేశారు. రవాణాశాఖ అధికారులు మురళీకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితులకు.. విజయవాడ వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి గోవింద జ్యూయలర్స్ సంస్థ అందజేసిన రూ.లక్ష చెక్కును మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కలెక్టర్ అంబేడ్కర్‌కు అందజేశారు.


రూ.లక్ష చెక్కు అందిస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే అదితి

ఏనుగులను కవ్వించొద్దు.. పార్వతీపురం గ్రామీణం: ఏనుగులు సంచరించే ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎఫ్‌వో జీఏపీ ప్రసూన కోరారు. గ్రామాల వైపు వెళ్లకుండా సిబ్బందిని అప్రమత్తం చేశామని, ఎవరూ వాటిని కవ్వించొద్దని సూచించారు. గ్రామాల్లోకి వస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

APS RTC పల్లె వెలుగు
టెండరు ప్రకటన
జోనల్ వర్క్‌షాప్/ జోనల్ స్టోర్స్/టైర్ రీట్రేడింగ్ షాప్, విజయనగరం నందు వివిధ రకాల పనులు చేయు నిమిత్తం స్కిల్డ్/అన్‌స్కిల్డ్/సెమి స్కిల్డ్/సఫాయి కర్మచారీలను మొత్తం 42 మందిని ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన సరఫరా చేయు నిమిత్తం అనుభవము, అర్హత కలిగిన మ్యాన్‌పవర్ ఏజెన్సీలు/ కాంట్రాక్టర్లు/ సంస్థల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు వర్క్స్ మేనేజర్ వారి కార్యాలయం, జోనల్ వర్క్‌షాప్, విజయనగరం నందు తేది.14-10-2024 నుండి తేది.24-10-2024 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు మరియు తేది.25-10-2024 మ॥12.00 గం॥ల వరకు మాత్రమే అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.25-10-2024న మ॥2.00 గం॥ల లోపు వర్క్స్ మేనేజర్ వారికి కార్యాలయం, జోనల్ వర్క్‌షాప్, విజయనగరం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయవలెను. అదేరోజు మ.3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://www.apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఏ సమయములోనైనా, ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.
నెం.E1/797(01)/2024-ZWS/VZM, తేది:07-10-2024 సం/- వర్క్స్ మేనేజర్, జోనల్ వర్క్‌షాప్, విజయనగరం.

పాముకాటుతో వృద్ధుడి మృత్యువాత


దుర్గారావు (పాతచిత్రం)

రేగిడి, న్యూస్‌టుడే: పాముకాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన రేగిడి మండలంలోని నాయురాలవలసలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆర్.దుర్గారావు(62) ఈ నెల 8న సాయంత్రం పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అక్కడి నుంచి శ్రీకాకుళం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీలావతి తెలిపారు. ఆయన భార్య, వివాహమైన ముగ్గురు పిల్లలున్నారు.

రైలు ఢీకొని 40 గొర్రెల మృతి

కొత్తవలస, న్యూస్‌టుడే: కొత్తవలస- పెందుర్తి సెక్షన్ల మధ్య మంగళవారం సాయంత్రం రైలు ఢీకొని చింతలపాలేనికి చెందిన 40 గొర్రెలు మృత్యువాత పడ్డాయని సర్పంచి సీతారామపాత్రుడు బుధవారం తెలిపారు. పట్టాలు దాటించే సమయంలో రైలు రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు. పెంపకందారులు ఎం.కృష్ణ, రాజు, గణేష్‌కు చెందిన జీవాలు మృతి చెందడంతో పాటు కొన్ని తీవ్ర గాయాలపాలయ్యాయన్నారు. విషయం తెలుసుకుని దెందేరు పశు వైద్య కేంద్రం సిబ్బంది వెళ్లి వాటికి చికిత్స చేశారు. బాధితులను ఆదుకోవాలని సర్పంచి కోరారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత బలవన్మరణం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గంట్యాడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికృష్ణ వివరాల మేరకు.. పెదవేమలికి చెందిన వి.కుమారి(35) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలుమార్లు వైద్యులను సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోయింది. మంగళవారం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేని ఆమె ఇంట్లోనే గడ్డిమందును తాగి అపస్మారకస్థితికి చేరుకుంది. గుర్తించిన కుటుంబీకులు విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళతో అసభ్యకర ప్రవర్తన

దేహశుద్ధి చేసిన బాధితురాలు

రాజాం, న్యూస్‌టుడే: తనతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మహిళ దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం రాజాంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజాం పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద భోజనం చేసేందుకు బుధవారం ఓ మహిళ వచ్చారు. ఆమె పట్ల ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో కోపోద్రిక్తురాలై అతన్ని దేహశుద్ధి చేశారు. స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. ఇలాంటి కీచకులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈమె దారి పొడవునా కొట్టుకుంటూ తీసుకెళ్లడంతో పలువురు స్థానికులు ఆమెకు మద్దతుగా నిలిచారు.

మెట్టపల్లిలో బంగారం చోరీ

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో మంగళవారం బంగారం చోరీకి గురైన ఘటనపై బాధితులు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై దామోదరరావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శేషపు కృష్ణ తన భార్య జయమ్మతో కలిసి గ్రామ సమీపంలోని శివాలయం వద్దకు మొక్కజొన్నలు తెచ్చేందుకు వెళ్లారు. వ్యవసాయ పనుల సామగ్రి కోసం వెళ్లిన అరగంటలోనే జయమ్మ ఇంటికి రాగా.. అప్పటికే తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి.. లోపలికి వెళ్లి చూశారు. ఏడు తులాల బంగారు పుస్తెలతాడు, హారం కనిపించకపోవడంతో భర్తకు సమాచారమిచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. క్లూస్‌టీమ్ సభ్యులు వచ్చి ఆధారాలు సేకరించారు.

ఆరు నెలల్లో 110 అగ్నిమాపక వాహనాలు


దస్త్రాలు పరిశీలిస్తున్న ఏడీ శ్రీనివాసులు

కొత్తవలస, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అగ్నిమాపక సేవల ఆధునికీకరణలో భాగంగా కొత్తగా 110 వాహనాలు కొనుగోలు చేయనున్నట్లు ఉత్తర ప్రాంత అగ్నిమాపక సేవలు అదనపు సంచాలకుడు జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కొత్తవలసలోని కేంద్రాన్ని పరిశీలించారు. 15 ఏళ్లు దాటిన వాహనాలు అధికంగా ఉన్నాయని, 15వ ఆర్థిక సంఘం నుంచి కేటాయించిన రూ.252 కోట్లతో కొత్తవి కొనుగోలు చేస్తామన్నారు. సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా 112కు ఫోన్ చేస్తే జీపీఎస్ ఆధారంగా ఆ కేంద్రానికి సమాచారం వెళ్తుందన్నారు. పరిశ్రమల్లో మంటలను ఆర్పేందుకు డ్రోన్లు, రోబోలను వినియోగించనున్నామన్నారు. ఖాళీగా ఉన్న 30 శాతం ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రిలిమినరీ పరీక్ష పూర్తయిందని చెప్పారు. విశాఖపట్నం ఆర్ఎఫ్‌వో డి.నిరంజన్‌రెడ్డి, విజయనగరం డీడీఆర్ఎఫ్‌వో రామ్ ప్రకాశ్, ఏడీఎఫ్‌వో సోమేశ్వరరావు, కొత్తవలస ఎస్ఎఫ్‌వో వై.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

విజయవాడ-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్): దసరా దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ- శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు తెలిపారు. నంబరు 07215 ప్రత్యేక రైలు ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17వ తేదీల్లో విజయవాడలో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కి శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో 10, 11, 12, 13, 15, 16, 17, 18వ తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో ఉదయం 6.30కి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ వస్తుందన్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతుందన్నారు.

పక్కాగా వ్యాపార రిజిస్ట్రేషన్లు

'న్యూస్‌టుడే'తో వాణిజ్య పన్నులశాఖ జేసీ



– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

వాణిజ్యపన్నుల శాఖ విజయనగరం డివిజన్ పరిధిలో వ్యాపార, వాణిజ్య సంస్థ బోగస్ రిజిస్ట్రేషన్లు అరికట్టేందుకు జీఎస్టీ సేవా కేంద్రాలు పక్కాగా పనిచేస్తున్నాయని సంయుక్త కమిషనర్ బి.నాగార్జునరావు తెలిపారు. 18, 28 శాతం జీఎస్టీ కలిగిన వస్తువుల క్రయవిక్రయాలపై దృష్టిసారించామని చెప్పారు. ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు, ఆడిట్‌లు నిర్వహిస్తున్నామని, కచ్చితమైన సమాచారం ఉంటేనే అనుమతులు ఇస్తున్నామని పేర్కొన్నారు. సకాలంలో రిటర్నులు దాఖలయ్యేలా చూస్తున్నామని వెల్లడించారు. లక్ష్యాలు, ఆదాయ వృద్ధి, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై ఆయన 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో మాట్లాడారు.

ముఖాముఖి

1121 దరఖాస్తులు..

జీఎస్టీ సేవా కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 1121 దరఖాస్తులు వచ్చాయి. 670 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేశాం. 17 తిరస్కరించగా, మిగిలినవి పరిశీలనలో ఉన్నాయి. కొన్నేళ్లుగా బోగస్ సంస్థలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా తనిఖీలు జరిగాయి. స్థానికంగా 21 సంస్థల వివరాలను పరిశీలించాం.

వాహన తనిఖీలకు 10 పాయింట్లు

డివిజన్ పరిధిలో విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలు ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో 10 వరకు వాహన తనిఖీ పాయింట్లు ఉన్నాయి. సహాయ, సహాయ డిప్యూటీ కమిషనర్లు తనిఖీల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. దసరా నేపథ్యంలో ముమ్మరం చేస్తున్నారు. వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా ముందుకెళుతున్నాం. సాధారణ సరకు పేరుతో జీఎస్టీ పరిధిలో ఉన్న సరకును రవాణా చేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తాం.

ఆలస్యమైతే.. రుసుం, వడ్డీ..

జీఎస్టీ వ్యాపారులు ప్రతినెలా 20లోపు రిటర్నులు దాఖలు చేయాలి. లేకుంటే మరుసటి రోజు నుంచి ఆలస్యపు రుసుము, వడ్డీ పడుతుంది. డివిజన్ పరిధిలో 17 వేల మంది జీఎస్టీ డీలర్లున్నారు. వారిని ఇప్పటికే అప్రమత్తం చేశాం. మా సిబ్బందితో అవగాహన సైతం కల్పిస్తున్నాం.

బిల్లు తప్పనిసరి

రూ.200 నుంచి ఏ సరకు కొన్నా బిల్లు ఇవ్వాల్సిందే. అంతకంటే తక్కువ కొంటే అంతకంటే వినియోగదారుడి కోరిక మేరకు తప్పని సరిగా ఇవ్వాలి. ఈ విధంగా చేసినప్పుడే లావాదేవీల నమోదు ప్రక్రియ సక్రమంగా జరుగుతుంది. ఈ ఆర్థిక ఏడాదిలో రూ.986 కోట్ల వసూళ్ల లక్ష్యం కాగా.. ఇప్పటివరకు రూ.360 కోట్లు వచ్చాయి. ఇతర ఆదాయ మార్గాలపై దృష్టిసారించాం.

భూముల అక్రమ రిజిస్ట్రేషన్

వీఆర్వోపై బాధితుల ఫిర్యాదు

భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం పంచాయతీకి చెందిన వీఆర్వో రామునాయుడుపై పలువురు బాధితులు బుధవారం తహసీల్దారు సురేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇదే మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన కర్రోతు శ్రీనివాసరావుకు సంబంధించిన 50 సెంట్ల భూమి తన సాగు హక్కులో ఉండగా, వేరే వ్యక్తుల పేరున, ఇదే ప్రాంతంలో ఓ రైతు పేరున ఉన్న 10 సెంట్ల భూమి వేరే వ్యక్తుల పేరుతో ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. ఈయనతో పాటు భోగాపురానికి చెందిన వైద్యశాఖలో పనిచేస్తున్న కె.దుర్గారావు అనే వ్యక్తి తన భూమిని మ్యుటేషన్ చేయించేందుకు గతేడాది రూ.5 వేలు ఆయనకు ముట్టజెప్పారని, ఇంకా డిమాండు చేయడంతో ఆ పని ముందుకు కదలలేదన్నారు. ఇలా చాలామంది బాధితులు ఉన్నారని, సంబంధిత వీఆర్వోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారంతా తహసీల్దారు ముందు వాపోయారు. దీనిపై 'న్యూస్‌టుడే' తహసీల్దారును వివరణ కోరగా రెవెన్యూ పనుల కోసం ఎవరికీ డబ్బులివ్వాల్సిన పనిలేదన్నారు. రెండ్రోజుల కిందటే ఆయన వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సకాలంలో నిత్యావసరాల పంపిణీ


సరకును పరిశీలిస్తున్న డీఎం మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురం డివిజన్ పరిధిలో ఈ ఏడాది వ్యాపార లావాదేవీల లక్ష్యం రూ.61.85 కోట్లుగా నిర్దేశించుకున్నట్లు డీఎం మహేంద్రకుమార్ తెలిపారు. బుధవారం ఎల్విన్‌పేటలోని నిత్యావసర సరకుల గోదామును సందర్శించారు. నాణ్యత, దస్త్రాలు, డిపోలకు సరఫరా అయిన సరకులు, మిగులు నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిపోలు, గోదాముల నిర్మాణానికి రూ.4.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెప్పారు. సేల్స్‌మెన్లు సమయపాలన పాటించి సకాలంలో నిత్యావసరాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ సాంబశివరావు ఉన్నారు.

ఓపీ కావాలంటే.. చరవాణి ఉండాలట!!

విజయనగరంలోని ప్రభుత్వాసుపత్రిలో ఓపీ విభాగమిది. ఓ వైపు కౌంటర్లన్నీ ఖాళీగా ఉన్నా.. రోగులు మాత్రం చరవాణులతో వరుసలో నిలబడ్డారు. ఇదేంటి విచిత్రంగా ఉందనుకుంటున్నారా.. కొన్ని రోజులుగా నడుస్తున్న తంతు ఇదే. గతంలో కన్నా రద్దీ పెరగడంతో ప్రత్యామ్నాయంగా చరవాణి ద్వారా ఓపీ రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటు కల్పించారు. రద్దీ ఉన్నప్పుడు మాత్రమే ఈ సేవలని పేర్కొన్నారు. కానీ కౌంటర్లన్నీ ఖాళీగా ఉన్నప్పటికీ సిబ్బంది మాత్రం.. రిజిస్ట్రేషన్ చేసుకునే రావాలని చెప్పడంతో రోజూ ఇలా వరుస కడుతున్నారు. ఈక్రమంలో నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది చరవాణుల్లేక వెనక్కి వెళ్లిపోతున్నారు. దీనిపై సూపరింటెండెంటు అప్పలనాయుడును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఖాళీగా ఉన్నప్పుడు నేరుగా ఓపీ చీటీ ఇవ్వాలని ఆదేశిస్తామన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం వైద్యవిభాగం


ఖాళీగా ఓపీ విభాగం.. ముందు చరవాణులతో రోగులు

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

GREAT BUSINESS OPPORTUNITY
Are you Looking for a Business Partner to make you Successful in your Business?
Join hands with leading Corporate to be local partner
Min. Investment
Assured Returns within 45 Days
Also an Opportunity to Travel Abroad for Training.
Ph: 92466 70657 83096 55089
Cadlabs, Visakhapatnam.

EDUCATION

Open School (APOS/ NIOS) 10th, Inter, Degree, PG, MBA, Polytechnic, B.Tech, MBBS, ANM, GNM, DMLT, BMLT, DRIT, BRIT, BOPTOM, All courses. Trustee Helpers, Education Jobs C: 7780352387.

HEALTH & CARE

మందు మాన్పించబడును సెక్స్‌లో బలహీనంగా వున్నారా.. అద్భుత పరిష్కారం Mind Power, గంటస్తంభం పక్కన, VZM. ఫోన్: 8885555513.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

మధురై మీనాక్షి జ్యోతిష్యం: ఫోటో, తాళపత్రం, జన్మపత్రిక చూసి ఉద్యోగం, వివాహం, సంతానం ఆర్థిక ఇబ్బందులు, స్త్రీ ప్రేమ, దాంపత్య సమస్యలు ఎటువంటివి ఉన్న పరిష్కారం, N.T. రామ్, 9866066393.

REAL ESTATE

ఆనందపురం, తగరపువలస (రాజుల తాళ్ళవలస) హైవేకి దగ్గరలో 950 Sft Flats & VUDA అప్రూవ్డ్ ప్లాట్లు ఫర్ సేల్. ✆ 7569397533/ 7842473219.

PLOT FOR SALE

225 Sq.Y North, East Corner Site for sale at K.L.Puram, Vizianagaram Cont: 8497961518.

300 Sq.Y West Facing Site for sale at Pradeep Nagar, Vizianagaram. Cont : 8497961518.

విశాఖ చుట్టు ప్రక్కల VMRDA అప్రూవ్డ్ ఇళ్ళ స్థలాలు స్పాట్/ వాయిదాలతో & బ్యాంక్ లోన్ సదుపాయంతో అమ్మకం. గరిమెళ్ళ పద్మావతి. 9493640700, 9493640600.

TO LET

COMMERCIAL

Godown 1150 Sq. ft. for Rent at Kothagraharam, 3rd line Main Road, Near Water Tank, Vizianagaram Cont: 9110550151.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 90008 66020

JOBS

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం.18K . ✆ 96402 58899, 96404 68899.

పోర్టులో సెక్యూరిటీ గార్డులు, ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. జీతం: 18-20 వేలు. అర్హత: 10th, RSR, జడ్జి కోర్టు నుంచి జగదాంబ రోడ్డులో, ఓస్టీ విమల్ షోరూమ్‌పై 3 వ ఫ్లోర్, వైజాగ్. ✆ 7306582829.

శ్రీరామ్ గ్రూప్‌లో పనిచేయుటకు BDEs కావలెను. M/F Salary 15,000/- to 25,000/- + ఇన్సెంటివ్స్ కలవు. Qly. Any డిగ్రీ. Exp. Min 2 సం॥, Age 25 to 35, కొత్తవలస, వేపాడ, S.కోటలో కావలెను. ✆ 9666331353.

FACULTY/ TEACHERS

Wanted experienced P.E.T. and Fluently English Speaking Faculty Contact No.7396869949.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి



ఎమ్మెల్యే బేబీనాయనకు రూ.21 వేలు అందజేస్తున్న చినదందబలగ గ్రామస్థులు

వరద బాధితులకు విరాళాలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల కోసం తెర్లాం మండలం చినదందబలగ గ్రామానికి చెందిన తెదేపా నాయకులు ఎమ్మెల్యే బేబీనాయనకు రూ.21 వేలు అందించారు. బొబ్బిలి పట్టణం 25వ వార్డుకు చెందిన కె.లక్ష్మి, సత్యనారాయణ రూ.20 వేలు, బాడంగి మండలం పిన్నవలస సత్యం రూ.6 వేలు, ఆనందబ్రహ్మ బృంద సభ్యులు రూ.10 వేలు అందజేశారు.

నేడు ఒంపల్లిలో ఆధార్ సేవలు

బొండపల్లి, న్యూస్‌టుడే: బొండపల్లి మండలంలోని ఒంపల్లి గ్రామంలో గురువారం తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ప్రబంధకుడు బి.ఉపేంద్ర తెలిపారు. ఆధార్‌లో తప్పులు సవరణ, నవీకరణ, కొత్తగా ఆధార్ చేసుకోవాలనుకునే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? గూడేంలో రైతు సేవా కేంద్రం నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. **- స్థానికులు**

● సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- తిరుపతిరావు, ఏవో**

– న్యూస్‌టుడే, గుర్ల

? గంట్యాడ విద్యా శాఖ కార్యాలయం వద్ద ఉన్న మరుగుదొడ్ల పరిసర ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. మరుగుదొడ్ల కోసం తవ్విన గొయ్యిపై పలకలు వేసి ప్లాస్టింగ్ చేయకుండా వదిలేశారు. **- స్థానికులు**

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడతాం. **- విజయకుమారి, ఎంఈవో**

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? బొండపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిలో చెత్త పేరుకుపోయింది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. **- స్థానికులు**

● త్వరలో చెత్తని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- ఎ.రఘుపతిరావు, ఈవోపీఆర్డీ**

– న్యూస్‌టుడే, బొండపల్లి

? అప్పలంపేట, కొల్లివలస గ్రామాల్లోని పలు వీధి కాలువల్లో పూడిక నిండి, దుర్వాసన వస్తోంది. **- స్థానిక యువకులు**

● అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. **- ఆర్.నీలిమ, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, తెర్లాం

? రామభద్రపురం జాతీయ రహదారి నుంచి సోంపురం వెళ్లే మార్గంలో తుప్పలు పెరిగిపోయాయి. **-కె.తవిటినాయుడు, స్థానికుడు**

● రహదారి బాగుకు ప్రతిపాదనలు పంపిస్తాం. **- నాయుడు, ఏఈ**

– న్యూస్‌టుడే, రామభద్రపురం

రూ.6 కోట్లతో ప్రతిపాదించండి



సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి, గరివిడి పట్టణాలతోపాటు గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా రూ.6 కోట్లతో కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులను సూచించారు. బుధవారం రాజాంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో డీఈ ఎ.శ్రీలత, నాలుగు మండలాల ఏఈలు ఐ.రామకృష్ణ, ఈశ్వరరావు, మురళీకిషోర్, శివాజులతో ఆ పనులపై సమీక్షించారు. కాలువల నిర్మాణానికి కొత్తగా ప్రతిపాదనలు తయారు చేస్తే వెంటనే నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ● చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రి వైద్యాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డా.పి.సుధీర్ ఎమ్మెల్యేను కలిశారు. రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలందించాలని కళా సూచించారు.

గంజాయి అక్రమ రవాణాపై నిఘా



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నారాయణరావు

బాడంగి (రామభద్రపురం), న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. బాడంగి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన దస్త్రాలను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. దసరా ఉత్సవాల్లో మందుగుండు కాల్చకూడదన్నారు. దీపావళికి లైసెన్సులు లేకుండా మందుగుండు అమ్మకూడదని చెప్పారు. అక్రమంగా మద్యం, ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రివేళల్లో చోరీలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఐ నారాయణరావు, ఎస్‌ఐ తారకేశ్వరరావు, ఏఎస్‌ఐ కొండలరావు పాల్గొన్నారు.

పొలం గట్టు... ఆదాయానికి మెట్టు

న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం, రామభద్రపురం

రైతులు పొలం గట్లపై కూరగాయలు సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. బొబ్బిలి డివిజన్‌లోని బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాల్లో ఈ ఏడాది 33 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా... వీటిలో సగం వరకు గట్లపై కూరగాయల విత్తనాలు నాటారు. వీటివల్ల వచ్చిన ఆదాయం పెట్టుబడిగా వినియోగిస్తున్నారు.



రామభద్రపురంలో చిక్కుడు సాగు

మూడు నెలల్లో..

నాట్లు వేసిన కొన్నాళ్ల తరువాత ఆగస్టు నెలాఖరులో గట్లు శుభ్రపరిచి గడ్డి, పనికిరాని మొక్కలు తొలగించి అన్నదాతలు బీర, బెండ, చిక్కుడు, వంగ, కాకర, ఆనప విత్తనాలు చల్లారు. అవి ఏపుగా పెరిగిన తరువాత పాదులు పైకి పాకడానికి వీలుగా కర్రలు ఏర్పాటు చేశారు. సెప్టెంబరు నుంచి నవంబరు వరకు కాయలు కాస్తాయి. వాటిని ఇంటికి, మిగిలినవి బజారుకు తీసుకెళ్లి అమ్ముతున్నారు. వారానికి 15 నుంచి 20 కిలోల వరకు కూరగాయలు పండుతున్నాయని, దాదాపు రూ.1000 వస్తోందని రైతులు అంటున్నారు. చిక్కుడు సాగు చేస్తున్నానని, రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకూ ఆదాయం వస్తోందని రామభద్రపురం గ్రామానికి చెందిన రైతు ఎం.శ్రీను 'న్యూస్‌టుడే'తో అన్నారు.



జగన్నాథపురం గట్టుపై పండిన బీర కాయల్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం అధికారులు

పంటకు రక్షణ

గట్లపై కూరగాయల సాగు వల్ల పంటల్ని పశువులు, పందులు పాడు చేయకుండా ఉండేందుకు కొంత వరకు రక్షణ కలుగుతుంది. వీటికి ప్రత్యేకంగా ఎరువులు వేయక్కర్లేదు. వరికి వేసిన ఎరువులు, పురుగు మందులే సరిపోతాయి. బొబ్బిలి మండలంలోని అలజంగి, పిరిడి, మెట్టవలస, గొల్లపల్లి, పారాది, గొర్లెసీతారాంపురం, కోమటిపల్లి, కలవరాయి, కృష్ణాపురం, జగన్నాథపురం, రామభద్రపురం, అప్పలరాజుపేట, ఎస్.సీతారాంపురం, గొల్లలపేట, బూసాయవలస తదితర గ్రామాల్లో ఈ విధానాన్ని పాటిస్తున్నారు. జగన్నాథపురంలో రైతు శంకరరావు ప్రకృతి వ్యవసాయం ద్వారా గట్లపై కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇటీవల ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్ర అధికారి కృష్ణారావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు పరిశీలించారు.

ప్రతి రైతు పాటించాలి

బొబ్బిలి డివిజన్‌లో పొలం గట్లపై కూరగాయల పెంపకం ఎక్కువగా ఉంది. ఇది ఎలాంటి ఖర్చు లేకుండా రైతులకు అదనంగా వచ్చే ఆదాయం. గతంలో తక్కువ మంది పండించేవారు. ఇటీవల దీనిపై అవగాహన పెరిగింది. పంటకు రక్షణగా కూడా ఉపయోగపడుతుంది. ప్రతి రైతు దీన్ని పాటించాలి. క్షేత్రస్థాయిలో సిబ్బంది సహాయంతో దీనిపై అవగాహన కల్పిస్తాం.

– ఎం.శ్యామ్‌సుందర్, ఏడీఏ, బొబ్బిలి

రహదారి లేక అవస్థలు

తెర్లాం మండలం సుందరాడ గ్రామంలోని ఎస్సీ వీధిలోకి వెళ్లేందుకు రహదారి లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఇక్కడ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేయలేదు. మరోపక్క కాలువల్లో పూడికలు పెరిగి మురుగు నిల్వ ఉండిపోయింది. మార్గానికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. సర్పంచి సహకారంతో పక్కా రహదారి నిర్మాణానికి కృషి చేస్తామని కార్యదర్శి మహేశ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, తెర్లాం



దారి పొడవునా గోతులే..!



సంతకవిటి మండలంలోని శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస, కొండగూడాం గ్రామాల గుండా రేగిడి మండలాన్ని కలిపే ప్రధాన రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. మార్గాన్ని బాగు చేయాలని 15 ఏళ్లుగా అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతున్నా ఫలితం లేదని స్థానికులు అంటున్నారు. దీనిపై పీఐయూ ఏఈ ఆనంద్ మాట్లాడుతూ.. రహదారిని బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

పునాదుల్లోనే నిలిచిపోయింది

కమ్మవలస సచివాలయంలో మంజూరు చేసిన ఆరోగ్య కేంద్రం పనులు పునాదుల్లోనే నిలిచిపోయాయి. ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తెస్తామంటూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ భవన నిర్మాణం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు మధ్యలో వదిలేశారు. ప్రస్తుతం అద్దె భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఏఈ రాజశేఖర్ పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం



ఎండకముందే పట్టించుకోండి



తోటపల్లి కాలువకు నీరు విడుదల చేసినప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడంతో శివారు పొలాలకు నీరు అందడంలేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల రైతులు నీరు కిందికి రాకుండా అడ్డుకట్టలు వేస్తున్నారని బూరాడ, తాటిపాడు, సోమరాజుపేట తదితర గ్రామాల కర్షకులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంటలు ఎండిపోయే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఏఈ వరప్రసాదును వివరణ కోరగా.. ప్రధాన కాలువలోనే ప్రవాహం తగ్గిందని, ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, రేగిడి

310 మందికి వైద్య పరీక్షలు

రాజాం, న్యూస్‌టుడే: రాజాం మున్సిపాల్టీ పరిధిలోని డోలపేట కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ఉచిత హృద్రోగ మెగా వైద్య శిబిరంలో 310 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధి గోకవలస మహేష్ తెలిపారు. జెమ్స్ ఆసుపత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.



రోగులకు సేవలు అందిస్తున్న వైద్యులు



రూ.లక్ష చెక్కు అందజేత

గంట్యాడ గ్రామీణం: ఇటీవల అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ బోనంగి గ్రామానికి చెందిన జి.సాయికుమార్‌కు రూ.లక్ష చెక్కును మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, నాయకులు బుధవారం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

రాజాం, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు కోరారు. తన మాతృమూర్తి నారాయణమ్మ ద్వాదశ దినకర్మ సందర్భంగా రాజాంలోని పలు ప్రాంతాల్లో 117 మొక్కలను నాటారు.

బూరాడ పీహెచ్‌సీకి రూ.87 వేలు

రేగిడి, న్యూస్‌టుడే: బూరాడ పీహెచ్‌సీకి ప్రభుత్వం నుంచి రూ.87 వేలు వచ్చాయని, వీటిని ఇద్దరు తాత్కాలిక పనివారికి వేతనాలతోపాటు కొన్ని మరమ్మతులు, పరికరాల కొనుగోలుకు వెచ్చించేందుకు నిర్ణయించామని వైద్యాధికారి ఎస్.చలమయ్య చెప్పారు. బుధవారం మండల పరిషత్తు ఉపాధ్యక్షులు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. వైద్యాధికారిణి రీనా చౌదరి పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: రాజుల రామచంద్రపురం సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ● బొబ్బిలి: అక్రమంగా 60 మద్యం సీసాలను తరలిస్తున్న రంగరాయపురం గ్రామానికి చెందిన తవిటినాయుడును అరెస్టు చేశామని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కేటాయించాలి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టికెట్ తూర్పు కాపులకు కేటాయించాలని తూర్పుకాపు రాష్ట్ర కార్యదర్శి ఎం.రమణమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. గతంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా వేపాడ చిరంజీవిరావును గెలిపించిన సంగతి గుర్తుచేశారు.

ఏపీఎం బాధ్యతల స్వీకరణ

మెరకముడిదాం, న్యూస్‌టుడే: మెరకముడిదాం మండల వెలుగు ఏపీఎంగా వై.ధనలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డ్వాక్రా సంఘాల సభ్యుల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు.

నేటిచిత్రం



వ్యర్థాలు తెచ్చిపడేస్తున్నారు

గజపతినగరం వద్ద చంపావతి నది నీటిని కలుషితమయం చేస్తున్నారు. చేపలు, కోడిమాంసం దుకాణాల వద్ద ఏర్పడే వ్యర్థాలను రోజూ స్థానిక వంతెన సమీపంలోని రహదారిపై నుంచి వెళ్లి విడిచి పెడుతున్నారు. అవి నీటి అడుగు భాగానికి చేరుకుని దుర్వాసన కొడుతోంది. ఈ నీరు దిగువ ప్రాంతాల్లో ఉన్న తాగునీటి ఊటబావుల మీదుగా పారుతోంది. ఈ నీరు తాగుతున్న ప్రజలు అనారోగ్యం పాలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ విషయాన్ని గజపతినగరం నీటిపారుదల శాఖ డీఈఈ పాండు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, గజపతినగరం

సరస్వతీ... నమస్తుభ్యం



చీపురుపల్లిలో మానసాదేవి

దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గాదేవి సరస్వతి రూపంలో దర్శనమిచ్చింది. ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. చీపురుపల్లి కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈవో బి.శ్రీనివాస్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. రామభద్రపురం, ఆరికతోటలోని దుర్గాదేవి మండపాల వద్ద ఎమ్మెల్యే బేబీనాయన ప్రత్యేక పూజలు చేశారు. సంతకవిటిలో సైపా యువజన సంఘం ఆధ్వర్యంలో 70 రకాల సారెను అమ్మవారికి సమర్పించారు. –న్యూస్‌టుడే, బొబ్బిలి, చీపురుపల్లి, గ్రామీణం, రామభద్రపురం, సంతకవిటి



చీపురుపల్లి కనకమహాలక్ష్మి కోవెలలో పూజలు



పాతబొబ్బిలి ఆలయంలో..



కృష్ణాపురం దుర్గాదేవి గుడిలో విద్యార్థులు



సంతకవిటి: 70 రకాల సారె సమర్పించిన మహిళలు

గత వైకాపా ప్రభుత్వ హయాంలో చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతామంటూ గొప్పలు చెప్పిన పాలకులు ఆచరణను గాలికి వదిలేశారు. గజపతినగరానికి చెందిన మల్లపు చెరువు సుందరీకరణకు మూడేళ్ల క్రితం చర్యలు తీసుకున్నారు. పూర్తిస్థాయిలో పనులు చేయకపోవడంతో ఖర్చు చేసిన నిధులు కూడా వృథా కాగా సుందరీకణ కాస్త అందవిహీనంగా మారిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, గజపతినగరం

రూ.లక్షలు ఖర్చు చేసి..
తుప్పలు పెంచారు



ముళ్ల చెట్ల మధ్య పడి ఉన్న మదుములు

మూడేళ్ల క్రితం మల్లప చెరువు గట్టును బలపరచడంతోపాటు, గర్భంలో ఉండే ఆక్రమణలు తొలగించి, చుట్టూ నడక మార్గం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. దీనికి గజపతినగరం, పురిటిపెంట గ్రామ పంచాయతీలకు చెందిన 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.20 లక్షలు కేటాయించేలా వైకాపాకు చెందిన పాలకులు ఒప్పందం తెలిపారు. ఆ మేరకు పనులు ప్రారంభించి గజపతినగరం పంచాయతీ నుంచి రూ.4.5 లక్షలు నిధులు ఖర్చు చేసి లోపలి భాగంలో నడక మార్గం ఏర్పాటు చేశారు. మూడు చోట్ల కల్వర్టులు వేసేందుకు సిమెంటు తూములు తెచ్చి, వదిలేశారు. మరోపక్క పురిటిపెంట పంచాయతీ నుంచి ఎలాంటి నిధులు అందించలేదు. నడక మార్గం కోసం చెరువులోపల ఉన్న మట్టిని తొలగించి గట్టుపై వేశారు. కొంత మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించారు. ఆ పనులు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. చెరువులోని పాత ఆక్రమణల తొలగింపు మాట ఎలా ఉన్నా గట్టుపై కొత్తగా ఆక్రమణలు పుట్టుకొచ్చాయని స్థానికులు అంటున్నారు. మరోపక్క ముళ్ల చెట్లు భారీగా పెరగడంతో నడవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆయా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ సుగుణాకరరావు వద్ద ప్రస్తావించగా.. త్వరలో పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

పీఎఫ్ ఖాతాలు తెరవాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు పింఛన్లు పొందేందుకు పీఎఫ్ ఖాతాలు తెరవడానికి ప్రతిపాదనలు పంపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు కోరారు. స్థానిక మండల విద్యావనరుల కార్యాలయం వద్ద బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ ఖాతాలను ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు సిద్ధం చేయాలన్నారు. 2009 ఏప్రిల్ నుంచి 010 పద్దు ద్వారా పురపాలక ఉపాధ్యాయులకు ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నా వారికి పీఎఫ్ ఖాతాలు లేకపోవడంతో పీఆర్సీ, డీఏ బకాయిలు కంపల్సరీ సేవింగ్ ఖాతాల్లో జమవుతున్నాయన్నారు. దీనివల్ల వారికి అందాల్సిన రూ.300 కోట్లు ప్రభుత్వం వద్దే ఉండిపోయాయన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.జోగినాయుడు, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సందడిగా బాణాల పండగ

గరివిడి, చీపురుపల్లి, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా చుక్కవలస గ్రామంలోని పాఠశాల విద్యార్థులు బుధవారం బాణాల పండగ నిర్వహించారు. శోధనా సంస్థ కోఆర్డినేటరు సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో చిన్నారులు బాణాలను చేతపట్టి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి దసరా పద్యాలు పాడారు. నాటి దసరా ఉత్సవాలను నేటి తరానికి గుర్తు చేయాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ● వంగపల్లిపేట పాఠశాల విద్యార్థులు బాణాలు చేతపట్టి దసరా పాటలు పాడుతూ వీధుల్లో సందడి చేశారు.



గరివిడి: దసరా పద్యాలు పాడుతున్న విద్యార్థులు

పంచాయతీ పాలకవర్గ సభ్యులకు శిక్షణ



బాడంగిలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి, గుర్ల, దత్తిరాజేరు, మెంటాడ, గజపతినగరం, బొబ్బిలి గ్రామీణం, రామభద్రపురం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో వార్డు సభ్యులే కీలకమని, అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని పలువురు ఎంపీడీవోలు అన్నారు. ఆయా మండల పరిషత్తు కార్యాలయాల్లో జరిగిన ఉపసర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమాల్లో మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేసిందని, వాటితో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నది చర్చించాలన్నారు. బొబ్బిలి, రామభద్రపురం, దత్తిరాజేరు, మెంటాడ, గజపతినగరం, బాడంగి కార్యాలయాల్లో జరిగిన శిక్షణలో ఎంపీడీవోలు రవికుమార్, శంబంగి రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, బీఎస్‌కె కూర్మనాథ్, రామకృష్ణ సూచనలు చేశారు. గుర్లలో ఎంపీపీ పి.ప్రమీల అవగాహన కల్పించారు.

పాఠశాలలో విగ్రహాల ఆవిష్కరణ

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండలంలోని చుక్కవలస ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం అబ్దుల్ కలాం, జవహర్‌లాల్ నెహ్రూ, సావిత్రిబాయి పులే, అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుడు రాజశేఖర్ తన బంధువులు, పలువురు దాతల సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి.రామారావు, ప్రధానోపాధ్యాయుడు రాజు, సర్పంచి అన్నంనాయుడు, మాజీ సర్పంచి బోడినాయుడు, సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఏజీపీకి బాల్య స్నేహితుల సత్కారం



చీపురుపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల ఏపీ హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా (ఏజీపీ) నియమితులైన చీపురుపల్లిలోని వంగపల్లిపేటకు చెందిన రెల్లి సూర్యనారాయణను ఆయన బాల్య స్నేహితులు బుధవారం సత్కరించారు. చీపురుపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1990-95లో ఆయనతోపాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు అభినందనలు తెలిపి జ్ఞాపికను అందజేశారు. పాత జ్ఞాపకాల్ని నెమరువేసుకున్నారు.

మహారాజశ్రీ రాజాం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S. 24/2018

Between:
కరూర్ వైశ్యాబ్యాంక్, రాజాం.
రిప్రజెంటెడ్ by Branch Manager ....వాది
మరియు
బుడిడ గూణ ప్రకాశరావు ....ప్రతివాది

నోటీసు

మహారాజశ్రీ రాజాం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు O.S. 24/2018 లో మీకు కోర్టువారు పలు దఫాలు నోటీసులు జారీ చేసివుంటిరి. కోర్టుకి హాజరుకమ్మని సదరు నోటీసులు మీకు అందనందున ఈ ప్రకటన ద్వారా కోర్టువారు నోటీసులు జారీ చేయించిరి.

కావున మీరు ఈ నెల అక్టోబరు 17వ తేదీన, ఉదయం 10.30 గం॥లకు మీరు గాని మీ తరుపున న్యాయవాది ద్వారా గాని హాజరు అవ్వగలరు. అట్లు కాని యెడల కోర్టు వారు తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకోగలరని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఆదేశంతో...)

R.E.CH. JAYADEV M.A.,M.A.,B.L.,
వాది తరపు న్యాయవాది,
Rajam. Cell: 9441116135, 9885206325

రాజాం,
తే. 09-10-2024ది.

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
విజయనగరం పట్టణం - 80089 02900
విజయనగరం గ్రామీణం - 80085 74317
ఎస్.కోట - 80085 74326
భోగాపురం - 80085 74319

?: కొత్తాగ్రహారంలో కాలువలను శుభ్రం చేయడం లేదు. - **స్థానికులు**

❖ సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం. - **సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి**

?: గూడ్స్‌షెడ్, సమతామార్గ్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. - **స్థానికులు**

❖ పరిశీలించి, బాగుచేయిస్తాం. - **ఎస్.అప్పారావు, డీఈఈ**

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

?: రావాడ ప్రధాన కూడలిలో విద్యుత్తు వెలుగులు నిలిచాయి - **రాజన్న, స్థానికుడు**

❖ తక్షణమే సమస్యను పరిష్కరిస్తాను. - **గాయత్రి, ఈవోపీఆర్డీ, భోగాపురం**

– న్యూస్‌టుడే, భోగాపురం

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

కొత్తవలస: దేశపాత్రునిపాలెం పంచాయతీ శివారు రెల్లికాలనీకి సమీపంలోని రిషిత రెసిడెన్స్ ఆవరణలో వ్యర్థాలు పేరుకుపోయాయి. స్థానికులు సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శి వి.కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో శుభ్రం చేయించారు.

గడియారాలు పనిచేస్తున్నాయ్..

విజయనగరం పట్టణం: గంటస్తంభం మీద ఉన్న నాలుగు గడియారాలు మళ్లీ పని చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సమస్యపై స్థానికులు ఎంపీజీ ఈశ్వరరావు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫోన్ చేశారు. సమస్యను కమిషనరు పి. నల్లనయ్య దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

పిల్లలకు ఆటపాటలతో విద్య

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పించాలని ప్రథమ జిల్లా సమన్వయకర్త జి.రమణ సూచించారు. విజయనగరం ఐసీడీఎస్ పరిధిలో ఉన్న బొత్సపేట రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. పూర్వ ప్రాథమిక విద్యా బోధనలో మెలకువలను కార్యకర్తలకు సూచించారు.

ఎస్.కోటలో మార్కెట్ల నిర్వహణ తీరిది

ఉన్నవి నిరుపయోగం.. కొత్తవాటికి తీర్మానం



పాత బస్టాండులో తొమ్మిదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న షెడ్లు

న్యూస్‌టుడే, శృంగవరపుకోట

ఎస్.కోట మేజరు పంచాయతీ ఆదాయం పెంచేందుకు రైతుబజారు ముందు.. విశాఖ - అరకు రోడ్డులో.. పాత బస్టాండులో కొత్త దుకాణాలు నిర్మించడానికి కార్యవర్గ సభ్యులు ప్రతిపాదనలు చేస్తున్నారు. దీనిపై ఇటీవలే ఎమ్మెల్యే లలితకుమారి సమక్షంలోనే తీర్మానం చేశారు. పంచాయతీ పరిధిలోని గ్రామీణ మాల్, పాత బస్టాండు ప్రాంతంలోని షెడ్లను నిరుపయోగంగా వదిలేసి.. కొత్తగా దుకాణాలు నిర్మించడమేమిటని పంచాయతీ ప్రజలు చర్చించుకుంటున్నారు.

మరమ్మతులకు గురవుతున్నాయ్..

గతంలో ప్రకాశం మార్కెట్‌ను కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామీణ మాల్‌గా అభివృద్ధి చేశారు. ఒకప్పుడు ప్రతి రోజూ బజారు జరిగేది. తర్వాత వారపు సంతగా మారిపోయింది. కొవిడ్ సమయం నుంచి పూర్తిగా మూతపడిందనే చెప్పాలి. ప్రతి శుక్రవారం సాయంత్రం అరకొరగా చేపలు విక్రయించే నాలుగైదు దుకాణాలు ఖాళీ ప్రదేశంలో పెడుతున్నారు. చీకటి పడగానే తీసేస్తున్నారు. దీనిని వినియోగంలోకి తీసుకొస్తామని, పాత బస్టాండు వద్ద రోడ్డు పక్కన జరుగుతున్న హోల్‌సేల్ మార్కెట్‌ను ఇక్కడకు తరలిస్తామని ప్రస్తుత కార్యవర్గం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ చెబుతున్నారు. కానీ ఆచరణలోకి రావడం లేదు. పాత బస్టాండు ప్రాంతంలో ఉన్న అత్యంత విలువైన స్థలం నుంచి పంచాయతీకి పైసా ఆదాయం రావడం లేదు. తొమ్మిదేళ్ల క్రితం రూ.10 లక్షల అంచనాతో సుమారు 56 షెడ్లు వేసి.. తారకరామ కూరగాయాల మార్కెట్‌గా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వినియోగంలోకి రాలేదు. షెడ్లు మరమ్మతులకు గురై మూలకు చేరుతున్నాయి.



అధ్వాన స్థితిలో ప్రకాశం మార్కెట్‌లోని షెడ్లు

వినియోగంలోకి తీసుకురావాలి..

ఉన్నవాటిని వినియోగంలో తీసుకొచ్చి ఆదాయం పెంచుకోకుండా కొత్తవి నిర్మించడానికి ఆసక్తి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ సాధారణ నిధుల ఖాతాలో కనీస మొత్తం లేక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొనైనా.. తక్షణం వీటిని వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు. దీనిపై ఈవో అనురాధ వద్ద ప్రస్తావించగా.. పంచాయతీ కార్యవర్గం దృష్టికి తీసుకెళ్లి.. వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు.

పైడితల్లి సన్నిధిలో చండీహోమం



పూజల్లో పాల్గొన్న భక్తులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: పైడితల్లి అమ్మవారి వనంగుడిలో బుధవారం చండీహోమం జరిగింది. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు నర్సింహమూర్తి, సాయికిరణ్ శర్మల వేదమంత్రాల నడుమ సంప్రదాయబద్ధంగా ఈ క్రతువు సాగింది. అంతకుముందు గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, పూర్ణాహుతి చేపట్టారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

విజయనగరం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడటం నేరమని, అటువంటి వ్యక్తులను, వ్యవస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రజలు సహకరించాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు కోరారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆడ బిడ్డలను కాపాడాలని కోరుతూ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆడ పిల్లల సంఖ్య తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అదనపు డీఎంహెచ్‌వో కె.రాణి, నోడల్ అధికారిణి అచ్యుతకుమారి, ఉప డీఎంహెచ్‌వో ఎన్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో మంచి నడవడిక సాధ్యం



గౌరవ వందనం స్వీకరిస్తున్న వి.ఎమ్.రెడ్డి

విజయనగరం గ్రామీణం, అర్బన్ న్యూస్‌టుడే: విద్యార్థుల జీవితంలో ఎన్‌సీసీ ఓ భాగం కావాలని, అందులో చేరితే క్రమశిక్షణ.. మంచి నడవడిక సాధ్యమవుతుందని ఎన్‌సీసీ తెలుగు రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.ఎమ్.రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విజయనగరం సమీపంలోని కోరుకొండ సైనిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణ శాఖలో ప్రవేశాల గురించి వివరించారు. పలువురు క్యాడెట్లకు ప్రశంసాపత్రాలు అందించారు. ప్రిన్సిపల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ❖ విద్యార్థులు దేశ సేవకు అంకితమవ్వాలని వి.ఎమ్.రెడ్డి సూచించారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కల్పించారు.

సిరిమానోత్సవానికి ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న ఈవో ప్రసాదరావు, పూజారి వెంకటరావు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలో ఈనెల 14, 15వ తేదీల్లో జరగనున్న పైడితల్లి అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవానికి రావాలని కోరుతూ ఆలయాధికారులు బుధవారం కలెక్టర్ అంబేడ్కర్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈవో డీవీవీ ప్రసాదరావు, సిరిమాను పూజారి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కొత్తవలస, వేపాడ, నెల్లిమర్ల, డెంకాడ: ఉప సర్పంచులు, పంచాయతీకి ఇద్దరు వార్డు సభ్యులకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణకు బుధవారం సగం మందే హాజరయ్యారు. వారితోనే శిక్షణ సాగించారు. ❖ వేపాడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణ పంచాయతీరాజ్ చట్టాలను వివరించారు. జడ్పీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు పాల్గొన్నారు. ❖ నెల్లిమర్ల ఎంపీపీ అంబళ్ల సుధారాణి, ఎంపీడీవో రామకృష్ణరాజు, ఈవోపీఆర్డీ శంకర్ జగన్నాథం, ఏవో పాల్గొన్నారు. ❖ డెంకాడ ఎంపీపీ బి.వాసుదేవరావు, ఎంపీడీవో భవాని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

కల్యాణం.. వైభోగం!



రామతీర్థం దేవస్థానంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాలార్చన, బాలభోగం, గ్రామ బలిహరణ చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన పట్టు వస్త్రాలతో స్వామిని అందంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ మేళ తాళాలతో కల్యాణ మహోత్సవం జరిపించారు. సాయంత్రం ఆస్థాన మండపంలో పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉత్సవమూర్తులను పల్లకీలో తిరువీధుల్లో ఊరేగించారు. ఈవో వై.శ్రీనివాసరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, నెల్లిమర్ల

సూర్యఘర్‌తో ఉత్పత్తిదారులు కావాలి



ఎల్.కోట ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఈ

ఎల్.కోట, న్యూస్‌టుడే: పీఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకుని విద్యుత్తు వినియోగదారులు ఉత్పత్తిదారులు కావాలని ఈఈ బి.సురేష్ బాబు తెలిపారు. బుధవారం ఆయన ఎల్.కోట ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. కాలుష్య రహిత విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. స్మార్ట్ మీటర్లతో మెరుగైన ఫలితాలు కనిపిస్తాయన్నారు. వినియోగానికి తగ్గట్టుగా నియంత్రికలు అమర్చేలా ప్రణాళిక వేశామన్నారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వద్దకు వెళ్లి కలవడంతో పలు సమస్యలను ఆమె ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

రాయితీపై టమాటా విక్రయం

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని రైతుబజారులో బుధవారం ఉదయం కిలో రూ. 50 చొప్పున టమాటా విక్రయించారు. బయట మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరిగినందున రాయితీపై కూరగాయలు వినియోగదారులకు అందించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు 750 కిలోల టమాటాలు విక్రయించారు. ప్రతి వ్యక్తికి కిలో చొప్పున ఇచ్చారు. గురువారం మరో 750 కిలోలు అమ్ముతామని ఎస్టేట్ అధికారి సంతోష్ తెలిపారు.



వరుసలో నిల్చున్న వినియోగదారులు

డాక్యుమెంట్స్ పోయినవి

నేను అనగా K. సుభాష్ చంద్రబోస్ S/o.Late [illegible] H.No: 8-18-24, TF1, R.K.పురం, [illegible] No: 1731/1981 [illegible] 2757/1977 [illegible] L.P. No:43/71, T.S. No: 692/3, 335 Sq.Yds [illegible]

K. సుభాష్ చంద్రబోస్ S/o. [illegible] H.No: 8-18-24 TF1, R.K. పురం, [illegible] విజయనగరం. Cell No: 9440031112.

దేవీ రూపం.. అపురూపం



నెల్లిమర్ల ధామస్‌పేటలో భక్తులను ఆకట్టుకుంటున్న నవదుర్గ అమ్మవారి ఆకృతులు

కంటోన్మెంట్, ఎస్.కోట, ఎల్.కోట, జామి, నెల్లిమర్ల, డెంకాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఎస్.కోట, ఎల్.కోట, జామి, కుమరాం, అలమండ మండపాల్లో అక్షరాభ్యాసాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. నెల్లిమర్ల ధామస్‌పేటలో నవదుర్గ ఆకృతులు ఆకట్టుకున్నాయి. గుసునూరుపేటలో దుర్గమ్మ జాతర మహోత్సవం నిర్వహించారు.



జామి బజారు సెంటరులో కూరగాయలతో..



కుమరాంలో సరస్వతీ అలంకరణలో దేవీ



వనంగుడిలో సరస్వతీ దేవిగా దుర్గాదేవి



పెన్నులు, పుస్తకాల అలంకరణలో సాలివీధి అమ్మవారు



కొండపల్లివారివీధిలో పుస్తకాలు, తమలపాకులతో..



ఎల్.కోటలో సరస్వతిగా దుర్గమ్మ



ఎస్.కోట దుర్గా ఆలయంలో అక్షరాభ్యాసాలు

చెరువుల ఆక్రమణలపై స్పందించరేం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరరావు

ఎస్.కోట, న్యూస్‌టుడే: పట్టణంలో మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో మొదటి నుంచి చివరి వరకు పలు సమస్యలపై అధికారులను ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి నిలదీశారు. అధికార పక్ష సభ్యులే అయినా పలు అంశాలపై అధికారులను నిలదీశారు. ముషిడిపల్లిలో బంద స్థలం 11సెంట్లు ఆక్రమించి వేసిన రోడ్డును ఎందుకు తొలగించలేదని వైస్ ఎంపీపీ తహసీల్దార్ అరుణకుమారిని ప్రశ్నించారు. ముషిడిపల్లి పంచాయతీలో నాలుగు చెరువుల్లో ఆక్రమణలు నిలువరించడానికి ఉపాధి పనులు చేపట్టాలని గ్రామసభల్లో ప్రతిపాదనలు పెట్టినా ఎందుకు మంజూరు చేయలేదన్నారు. వసి గ్రామంలో వీవోఏల నియామకంపై ఏపీఎం రమణను ఎంపీపీ నిలదీశారు. ఎస్.కోట సర్పంచిగా ప్రతిపాదించిన పనులు మంజూరు కాలేదని సంతోషికుమారి ప్రశ్నించారు. జడ్పీటీసీ సభ్యురాలు ఎం.వెంకటలక్ష్మి, ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ అరుణకుమారి పాల్గొన్నారు.

'ఏటీఎం'తో రైతులకు నిరంతర ఆదాయం

కొత్తవలస, వేపాడ, న్యూస్‌టుడే: ఏకపంట విధానానికి బదులు ఏటీఎం విధానంలో పలు రకాల పంటల సాగుతో నిరంతర ఆదాయం పొందవచ్చని ఏపీసీఎన్ఎఫ్ ప్రాంతీయ సాంకేతిక నిపుణుడు కె.ప్రకాశ్ అన్నారు. కొత్తవలస మండలం దేవాడలో రైతు ప్రమీలరాణి పొలంలో 30 సెంట్లలో ఏ గ్రేడ్, 20 సెంట్లలో ఏర్పాటుచేసిన ఏటీఎం మోడల్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఏటీఎం విధానంలో బెడ్స్ వేసి దానిపై ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా వివిధ రకాల మొక్కలు, ఆకుకూరలు, తీగజాతి కాయగూర పంటలు, దుంపజాతి పెట్టడం వల్ల 365 రోజులూ ఆదాయం వస్తుందన్నారు. మాస్టర్ ట్రైనర్ కోటిబాబు, మోడల్ మేకర్ రమణ, యూనిట్ ఇన్‌ఛార్జి ఉష, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు. వేపాడ మండలం కృష్ణారాయుడుపేటలో దేముడు ఏటీఎం పంటను పరిశీలించారు.



ఏటీఎం మోడల్‌ను పరిశీలిస్తున్న ప్రకాశ్

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



శిక్షణలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో జి.చంద్రకళ కోరారు. బుధవారం విజయనగరం మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాలను సందర్శించి, ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా మురికివాడలు, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు నియంత్రణ సంస్థ జిల్లా ప్రబంధకుడు ఎస్.గోపాలరావు తెలిపారు. అందులో భాగంగా బుధవారం 'మీకు తెలుసా..' పేరుతో నగరంలో అవగాహన ర్యాలీని చేపట్టామన్నారు. సంస్థ పర్యవేక్షణాధికారిణి కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



వివరాలు చెబుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: చంపావతి నది పరివాహక ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న ఎనిమిది మంది నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి విజయనగరంలో ఎస్పీ వకుల్ జిందాల్ విలేకరులకు ఆ వివరాలు తెలిపారు. చంపావతి సమీపంలో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్‌ఐ బి.గణేష్, సిబ్బందితో పాటు వెళ్లి దాడి చేశారు. అక్కడ గంజాయి విక్రయిస్తున్న అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన సురభి పార్థసారథి, జ్యోతుల బద్రినాథ్, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలానికి చెందిన కొర్ర భాస్కరరావు, సేవిస్తున్న జి.తేజ, కె.గణేష్, డి.అనుదీప్, ఎస్.రఘుచరణ్, ఏ.ఈశ్వరరావులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 8 కిలోల గంజాయి, 7 చరవాణులు, బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

సంక్షిప్త సమాచారం

వేపాడ తహసీల్దారుగా రాములమ్మ



వేపాడ: మండల తహసీల్దారుగా రాములమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సీతానగరం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

22న ప్రాంతీయ సదస్సు

అయ్యన్నపేట/మయూరికూడలి: కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు కోరారు. 22న అనకాపల్లిలో నిర్వహించబోయే ప్రాంతీయ రైతు సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విజయనగరంలో ఆవిష్కరించారు.

భాజపా సభ్యత్వ నమోదు

ఎస్.కోట: పట్టణంలోని దేవీగుడి కూడలిలో భాజపా విశాఖ పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీరంగం దానేష్, బీజైవైఎం రాష్ట్ర నాయకులు వై.రవి, వారాది చిరంజీవి యాదవ్, మారిన శ్రీను పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మత్తుతో జీవితాలు చిత్తు

వేపాడ, న్యూస్‌టుడే: మత్తుతో జీవితాలు చిత్తవుతాయని వల్లంపూడి ఎస్‌ఐ బి.దేవి అన్నారు. మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.

గర్భిణులకు ప్రత్యేక తనిఖీలు

వేపాడ, జామి: వేపాడ పీహెచ్‌సీలో గర్భిణులకు ప్రత్యేక తనిఖీలను వైద్యాధికారిణి ఎ.ధరణి నిర్వహించారు. పీఎం మాతృత్వ అభియాన్‌లో భాగంగా 38 మందికి వైద్య పరీక్షలు చేసి మందులిచ్చారు. బానాది సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భోజన ఏర్పాటు చేశారు. జామి పీహెచ్‌సీలో 150 మంది గర్భిణులకు వైద్యాధికారిణి స్వరాజ్యలక్ష్మి తనిఖీలు నిర్వహించారు. సత్యసాయి భజనమండలి భోజనాలు ఏర్పాటు చేశారు.

వందశాతం వసూలు చేయండి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లో ఆస్తి పన్నులను వందశాతం వసూలు చేయాలని కమిషనరు కె.అప్పలరాజు సూచించారు. బుధవారం నెల్లిమర్లలో 2, 3, 7 వార్డుల పరిధిలో వసూలు ప్రక్రియ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పంచాయతీల్లో ఉన్న నీటి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆర్ఐ ఉమాభాస్కర్ ఉన్నారు.

ఈత, చోదకం తప్పనిసరి

కొత్తవలస: అగ్నిమాపకశాఖలో పనిచేసే సిబ్బందికి విధిగా ఈత, వాహనం నడపడం వచ్చి ఉండాలని అగ్నిమాపక సేవలు రాష్ట్ర అదనపు డైరెక్టర్ జి.శ్రీనివాసులు అన్నారు. కొత్తవలస అగ్నిమాపక కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. కేంద్ర అధికారి వై.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా మయూరి కర్టన్ బ్రాంచ్ పైపును వినియోగించి వాటర్ కర్టన్‌ను తయారు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా కేంద్రం ముందు సిబ్బంది ప్రదర్శించారు. ఆవరణలో మొక్క నాటారు.

బురద నీరే దిక్కు!

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మవరం పంచాయతీలో కుళాయిలకు కలుషిత నీరు సరఫరా అవుతోందని గ్రామస్థులు బుధవారం ఆరోపించారు. గత కొన్నిరోజులుగా కుళాయిల ద్వారా వస్తున్న నీటిలో ఇసుక, బురద ఉంటోందన్నారు. దీంతో గ్రామంలో కొందరికి వాంతులు, విరేచనాలు, జ్వరాల బారిన పడుతున్నారని వాపోయారు. గ్రామానికి మామిడిపల్లి వద్ద ఉన్న ఊటబావుల ద్వారా మంచినీరు సరఫరా అవుతోంది. గ్రామంలో సుమారు 980 వరకు కుళాయిలున్నాయి. ఊటబావుల పక్కన ఇసుక తవ్వకాల వల్ల నీరు కలుషితం అవుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై రక్షిత మంచినీటి విభాగం ఏఈ ఝాన్సీ వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ధర్మవరంలో బిందెలో ఇసుక, బురద నీరు



మహారాజా అలక్ నారాయణ్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (మాన్సాస్)
దేవాదాయ ధర్మాదాయ శాఖ - కోట - విజయనగరం

ఆర్.సి.నెం.135/2024, తే.08.10.2024దీ

బహిరంగ వేలం ప్రకటన

మాన్సాస్ ట్రస్ట్, విజయనగరం వారికి చెందియుండి వారి హక్కుభుక్తములోని విజయనగరం జిల్లాలో ఈ దిగువ షెడ్యూలులో తెలుపబడిన గ్రామాలలో గల భూములను సాగు చేసుకొనుటకుగాను తే.01.11.2024 నుండి 30.06.2027దీ వరకు అగు మూడు సంవత్సరములు కాలపరిమితికి లైసెన్సు హక్కుకొరకు బహిరంగ వేలంలో ఇచ్చుటకుగాను షెడ్యూలులో చూపబడిన తేదీ, సమయం మరియు స్థలము వద్ద అధికారుల సమక్షములో బహిరంగ వేలం వేయబడును.

షెడ్యూలు

బహిరంగ వేలము వివరములు			విస్తీర్ణం	వేలము జరుపు	బహిరంగ వేలము
వ. నెం.	గ్రామం పేరు	సర్వే నెం.	ఎ. సెం.	తేదీ సమయం	జరుగు ప్రదేశం
1	ధర్మపురి గ్రామం విజయనగరం మండలం	24/2, 27/1, 28, 48/28, 105/8, 104/57, 104/1, 103, 96/2, 85, 81/1, 76/2, 76/4, 76/5, 101/12, 20, 21, 31/2, 3, 4, 100, 106, 107/3, 109/2, 3, 110/1, 2, 3, 112, 113/3, 114, 115/2, 116/2, 117/1, 118, 119, 120	225.04	24.10.2024 నుండి 26.10.2024 వరకు ఉదయం గం.10-00 ల నుండి	గ్రామ సచివాలయం లేదా రామమందిరం ధర్మపురి
2	కొండకరకాం గ్రామం విజయనగరం మండలం	20/1, 133/1, 3, 134, 158/1, 161/1, 2, 168	44.86	తే.28.10.2024దీ ఉదయం గం.10-00ల నుండి	గ్రామ సచివాలయం లేదా రామమందిరం కొండకరకాం
3	బొడ్డవలస గ్రామం డెంకాడ మండలం	2, 3, 4, 5, 53/1, 87, 88/1	164.80	29.10.2024 & 30.10.2024 ఉదయం గం.10-00ల నుండి	గ్రామ సచివాలయం లేదా రామమందిరం బొడ్డవలస

బహిరంగ వేలం షరతులు

1) బహిరంగ వేలములో పాల్గొను వారు ముందుగా పాట దారులు ఒక్క యకరము లోపులలో ఉన్న భూమికి ప్రథమ ధరావత్తు రూ.1,000/- చొప్పున మరియు మూడు ఎకరములు యున్న యెడల 3000/- చొప్పున, ఎన్ని ఎకరాలు వుంటే అన్ని వేలు ప్రథమ ధరావాతు చెల్లించు నిర్ణయము. 2) అధికారులచే గుర్తింపు పొందిన ఆధార్ / ఓటర్ ఐడి/ డ్రైవింగ్ కార్డు కాపీ తప్పనిసరిగా సమర్పించవలెను. 3) లీజుకాలము స్వాధీనము చేసిన తేది నుండి మూడు సంవత్సరములు బహిరంగ వేలం వేయబడుచున్నది. 4) మాన్సాస్ సంస్థకు బకాయిలు ఉన్నవారు కాని, ఏదైనా కోర్టులో ఈ సంస్థతో లావాదేవీలు ఉన్నవారు కాని బహిరంగ వేలం పాటలో పాల్గొనుటకు అనర్హులు. 5) హెచ్చు పాటదారు పేరు పాట కొట్టివేసిన వెంటనే ఒక్క సంవత్సరము సొమ్ము అడ్వాన్సు చెల్లించు నిర్ణయము 6) మిగిలిన షరతులు జిల్లా ఎండోమెంట్ అధికారుల వద్ద లేక MANSAS ట్రస్ట్ కార్యాలయము నందు పొందవచ్చును.

ఫోన్: 9491000709, 7013678146.

సం/- కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్
ఉప కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి,
మాన్సాస్ ట్రస్ట్ - దేవాదాయ ధర్మాదాయ శాఖ, విజయనగరం

(c) eenadu